నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గోల్కొండ: విద్యుత్ ఫీడర్ల మరమ్మతులు, విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల నరికివేత తదితర కారణాల వల్ల గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. ఐటీఐ మల్లేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని అన్వరుల్ ఉలూం 11 కేవీ ఫీడర్ పరిధిలోని బడా మసీదు, ప్రియా థియేటర్, మల్లేపల్లి చౌరస్తా, భారత్ గ్రౌండ్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదు. అదే విధంగా ఎస్‌డి ఆసుపత్రి సబ్‌స్టేషన్ పరిధిలోని హుమాయున్‌నగర్ ఫీడర్‌లోని హుమాయున్ నగర్, మెహిదీపట్నం, శ్రీరామ్‌నగర్, మురాద్‌నగర్, ఎంఐజీహెచ్ ప్రాంతాల్లో ఉదయం 11.30 నుంచి ఒంటి గంట వరకు, నాంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని పెరల్ రీజెన్సీ 11 కేవీ ఫీడర్ పరిధిలోని లక్డీకాపూల్, ట్యాంపీ, బజార్‌ఘాట్, ప్రగతి ప్రెస్ ఏరియా ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 4.30 వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

కాంగ్రెస్ పాలనలోనే బీసీలకు న్యాయం

గోల్కొండ: కాంగ్రెస్ పాలనలోనే బీసీలకు న్యాయ జరుగుతుందని రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్ సి.నిరంజన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర బీసీ కమీషన్ చైర్మన్‌గా నియమితులైన సందర్భంగా కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు బుధవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బీసీలకు పూర్తి న్యాయం జరిగేలా కృషి చేస్తానని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల కష్టసుఖాలు తెలిసిన వారని రాష్ట్రంలోని బీసీల సమస్యలపై ఆయనకు సంపూర్ణ అవగాహన ఉందని ఆయన అన్నారు. ఆయనను కలిసిన వారిలో టీపీసీసీ కార్యదర్శి అప్సర్ యూసుఫ్ జాహీ, అబ్దుల్ హనీద్ ఖాన్ తదితరులున్నారు.

అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కార్పొరేటర్



మైలార్‌దేవ్‌పల్లి: బాబుల్‌రెడ్డినగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషక్ పక్వాడ (పోషణ పక్షం) కార్యక్రమాన్ని బుధవారం కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు, గర్భిణీలకు, చిన్నారుల పట్ల అంగన్ వాడి టీచర్లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, పౌష్టిక ఆహారాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కవిత, నవయువ యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, అంగన్ వాడి టీచర్లు అనిత, మాధవి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నిమజ్జనోత్సవం



రూ.1.5 లక్షలకు లడ్డూ దక్కించుకున్న వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగి రవితేజ

సుల్తాన్‌బజార్: టీఎన్జీఓస్ డీఎంహెచ్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఐదు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం స్వామివారి నిమజ్జనం ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా టీఎన్జీఓస్ డీఎంహెచ్‌ఎస్ యూనిట్ సంఘం ఆధ్వర్యంలో లడ్డూ వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో రవితేజ అనే ఉద్యోగి రూ.1.5 లక్షల రూపాయాలకు వేలం పాటలో లడ్డును దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో యూనిట్ అధ్యక్షులు మామిడి ప్రభాకర్, కార్యదర్శి హరి చక్రధర్, క్రాంతి, ప్రభాకర్, కిరణ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసారంగా తవ్వకాలు

నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ల కోసం ఏర్పాట్లు



జాంబాగ్ రిసాలబ్జుల్లాలో అక్రమంగా సెల్లార్ తవ్వుతున్న దృశ్యం

అబిడ్స్: జీహెచ్ఎంసీ గోషామహల్ -14వ సర్కిల్ పరిధిలో అడ్డగోలుగా అక్రమ సెల్లార్లు తవ్వుతుండడంతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. జాంబాగ్ పరిధిలోని రిసాలాబ్జుల్లాలోని ప్రభుత్వ బాలుర వసతి గృహం సమీపంలో అక్రమంగా సెల్లార్ తవ్వకాలు చేపడుతున్నారు. గత కొన్నిరోజులుగా జీహెచ్ఎంసీ నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ తవ్వుతుండడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ నిబంధనల ప్రకారం.... వర్షాకాలంలో సెల్లార్ల తవ్వకాల అనుమతులు లేవని నిబంధనలు పెట్టారు. ఆ నిబంధనలను తుంగలో తొక్కిన భవన యజమాని సెల్లార్ తవ్వకాలు చేపడుతున్నారు. సెల్లార్‌కు వెళ్లే రోడ్డు అతి చిన్నగా ఉండడంతో స్థానికులు బెంబేలెత్తి పాతున్నారు. జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారుల అనుమతులు లేకుండా సెల్లార్ ఎలా తవ్వుతారని ప్రశ్నిస్తున్నారు.

సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చొరవ చూపాలి



ఎంపీ అసదుద్దీన్ ఓవైసీతో విద్యుత్ అధికారులు

శాలిబండ: బహదూర్‌పురాలోని ఫారూఖ్‌నగర్‌లో సబ్‌స్టేషన్ ఏర్పాటుకు చొరవ చూపాలని చార్మినార్ విద్యుత్ శాఖ డీఈ లింగయ్య బుధవారం ఎంపీ అసదుద్దీన్‌ను కలిసి కోరారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సబ్ స్టేషన్ నిర్మాణం ముఖ్యమని..అందుకే అవసరమైన భూమిని వెంటనే అందించాలని ఎంపీని కోరామన్నారు. ఎంపీని కలిసిన వారిలో ఎమ్మెల్యే మోబీన్ ఖాన్, మీరాలం ఏడీఈ వెంకటేశ్, ఫలక్‌నుమా ఏడీఈ సీబీడీ మధుసూదన్ రెడ్డి, ఏఈ శ్రీనివాస్ ఉన్నారు.

సన్మానం

రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన జి.నిరంజన్‌కు చాంద్రాయణగుట్ట నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బాగేందర్ సింగ్ కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. -చాంద్రాయణగుట్ట



భారీగా నిషేధిత గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

నాంపల్లి: నిషేధిత గుట్కా ప్యాకెట్లను తరలిస్తున్న ఓ వాహనాన్ని హబీబ్‌నగర్ పోలీసులు సీజ్ చేసి రూ.2,88,000 విలువ కలిగిన గుట్కా ప్యాకెట్లను, సరుకును తరలిస్తున్న సప్లయర్, డ్రైవర్, హెల్పర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. సీతారామ్‌బాగ్ ఫ్రెండ్స్ కేఫ్ వద్ద పెట్రోలింగ్‌లో భాగంగా పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఓ వాహనం (ఏపీ 39 యుహెచ్ 6930) అటుగా వచ్చింది. ఈ వాహనాన్ని పోలీసులు తనిఖీ చేయగా అందులో 30 బాక్సులతో నింపిన గుట్కా పాకెట్లు ఉన్నాయి. ఒక్కో బాక్సులో 60 ప్యాకెట్ల చొప్పున ప్యాకింగ్ చేశారు. వెంటనే వాహనాన్ని సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. వాహనంతో పాటు సప్లయర్, డ్రైవర్, హెల్పర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

మిలాద్- ఉన్-నబీ ఊరేగింపునకు పోలీసులు సహకరించాలి

అత్తాపూర్: సెప్టెంబర్ 19న జరిగే మిలాద్-ఉన్-నబీ ఊరేగింపుకు అనుమతితో పాటు ప్రశాంత వాతావరణంలో జరుపుకునే విధంగా పోలీసులు సహకరించాలని సులేమాన్ నగర్ డివిజన్ నాయకులు ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. సులేమాన్‌నగర్ డివిజన్‌తో పాటు కిషన్ బాగ్ వరకు ఈ ఊరేగింపు కార్యక్రమం ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా నిరసన

రాజేంద్రనగర్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా బుధవారం ఢిల్లీలో వర్గీకరణకు వ్యతిరేకంగా వందలాది మంది దళిత సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న బహిరంగ సభకు మద్దతుగా.. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం జేఏసీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు భారీ నిరసన నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ మాలల విశ్వరూపాన్ని చూపిస్తామని, గత 15 రోజుల క్రితం మాల ఎమ్మెల్యేలు, మాల ఎమ్మెల్సీలు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాట సమితి నాయకులు సీఎంని కలిసి విజ్ఞప్తి కూడా చేస్తామన్నారు. తెలంగాణలో ఎస్సీలకు ఇప్పుడు ఉన్నటువంటి 15 శాతం నుంచి 20 శాతం రిజర్వేషన్లు పెంచాలని సీఎం రేవంత్ రెడ్డిని కలిసి చెప్పడం జరిగిందన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం





మైలార్‌దేవ్‌పల్లి: డీసీయంకు బ్రేకులు ఫెయిల్ కావడంతో బీభత్సం సృష్టించింది. బుధవారం మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని కాటేదాన్ సిటిజన్ కాంట సమీపంలో కాటేదాన్ నుంచి టీఎన్జీవోస్ కాలనీకి వెళ్తున్న డీసీయంకు ఒక్కసారిగా బ్రేకులు ఫెయిల్ కావడంతో రోడ్డు క్రిందికి దూసుకొచ్చింది. ఈ ఘటనలో ఓ మహిళ ద్విచక్రవాహం పూర్తిగా ధ్వంసంకాగా, ప్రమాదంలో మహిళకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు మహిళను స్థానిక ఆసుపత్రికి తరలించారు. కిరణషాపు షెడ్ పాక్షికంగా ధ్వంసం అయ్యింది. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేపట్టారు.

నాటక రంగాన్ని కాపాడుకోవాలి



నాటక పోటీలను ప్రారంభిస్తున్న కొండల్‌రావు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో యువకళ వాహిణి ఆధ్వర్యంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకలను బుధవారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కినేని నాగేశ్వర రావు నాటక కళాపరిషత్ 30వ ఉభయ తెలుగు రాష్ట్ర స్థాయి నాటక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక బంధు సారిపల్లి కొండల్‌రావు మాట్లాడుతూ.. నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. నాటక పోటీలను నిర్వహించడం అభినందనీయమని నాటక రంగాన్ని ప్రోత్సాహించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. అనంతరం వివిధ అంశాలపై నిర్వహించిన నాటక పోటీలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. మూడురోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి కేవీ. కృష్ణకుమారి, నాట్య గురువు ప్రసన్నరాణి, యువ కళావాహిని అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణలతో పాటు పలువురు రంగస్థల నటులు పాల్గొన్నారు.

కార్వాన్ అభివృద్ధికి చొరవ చూపాలి



బల్దియా కమిషనర్ ఆమ్రపాలితో మాట్లాడుతున్న మజ్లిస్ ఎమ్మెల్యే కౌసర్, ముబీన్ తదితరులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధికి చొరవ చూపాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్‌తో కలిసి బల్దియా కమిషనర్ ఆమ్రపాలిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన కార్వాన్ నియోజకవర్గ సమస్యలను, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను బల్దియా కమిషనర్‌కు వివరించారు. ఎస్ఎన్‌టీపీ ఫేజ్-2లో నాలుగు బాక్స్‌టైప్ డ్రైనేజీ పనులు చేపట్టాలని కోరారు. సీఆర్ఎంపీ పథకంలో భాగంగా వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. కార్వాన్ నియోజకవర్గంలో ఒకసారి పర్యటించాలని ఆమెను కోరారు.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన డీసీ



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీసీ రవి కుమార్, వివిధ శాఖల అధికారులు

రాజేంద్రనగర్: సర్కిల్ పరిధిలోని పత్తికుంట, పల్లె చెరువు, మీరాలం ట్యాంక్ చెరువులను బుధవారం సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 5వ రోజు రాజేంద్రనగర్ సర్కిల్‌తో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ఉదయం నిమజ్జనానికి గణనాథులు తరలివస్తున్నాయన్నారు. చిన్న గణనాథులను తమ సిబ్బంది నిమజ్జనం చేస్తున్నట్లు తెలిపారు. భారీ గణనాథుల కోసం ప్రస్తుతం మీరాలం ట్యాంక్, పత్తికుంట, పల్లె చెరువు ప్రాంతాల్లో ఒక్కో క్రేన్‌లను ఏర్పాటు చేశామని, మరో రెండు క్రేన్లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం మూడు క్రేన్లతో పత్తికుంటలో నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో నిమజ్జనంలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా తగు చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టేలా స్పెషల్ డ్రైవ్‌లను చేపడుతున్నామని వెల్లడించారు. 7,9,11వ రోజుల్లో 24 గంటల పాటు సిబ్బంది అందుబాటులో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

అధ్యాపక వృత్తి ఎంతో పవిత్రమైంది



బీజేఆర్ ప్రభుత్వ బాలిక కళాశాల ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: అధ్యాపక వృత్తి ఎంతో పవిత్రమైన వృత్తి అని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గోల్కొండ బీజేఆర్ ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.మాధవిని బుధవారం సన్మానించారు. ఉత్తమ అధ్యాపకురాలిగా ఎంపికైన సందర్భంగా వీనస్ హైస్కూల్ ఆడిటోరియంలో ఆమెకు శాలువా కప్పి మెమెంటో అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కళాశాలలో ఎక్కువ మంది బాలికలు పేద కుటుంబాలకు చెందిన వారు అని అన్నారు. గత కొంత కాలంగా ఈ కళాశాల విద్యార్థినిలు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్నారని ఆయన అన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ మాధవి మాట్లాడుతూ ప్రతి యేడు కళాశాలలో చేరుతున్న విద్యార్థినిల సంఖ్య పెరుగుతుందని అన్నారు. శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు బొమ్మల శ్రీకాంత్‌చారి, సలహాదారు బి.సాయి బాబాచారితో పాటు ప్రముఖ వైద్యుడు డాక్టర్ మహ్మద్ మజహరుల్లా, వీనస్ విద్యా సంస్థల చైర్మన్ మహ్మద్ హిదాయత్ అలీఖాన్ తదితరులున్నారు.



ధోబీఘాట్ గణేష్ మండపంలో..



కాగజ్‌గూడ శంకర్‌జీ హనుమాన్‌జీ టెంపుల్‌లో..



దీపక్ టాకీస్ గణేష్ మండపం వద్ద అన్నదానం



విజయనగర్‌కాలనీ నారాయణ స్కూల్‌లో గణనాథునికి పూజలు



కార్వాన్‌లో వినాయక మండపంలో బీజేపీ నాయకురాలు మాధవీలత తదితరులు



జాంబాగ్‌లో..



బేగంబజార్ రంగీన్ క్లబ్ ఆధ్వర్యంలో..

గణనాథుడికి పూజలు

గోల్కొండ: వినాయక మండపాలల్లో కొలువుదీరిన గణేశుడి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. కార్వాన్, గుడిమల్కాపూర్, షేక్‌పేట్ తదితర ప్రాంతాల్లో వినాయక మండపాల వద్ద సాయంత్రం కాగానే ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంటుంది. పూజల్లో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొంటున్నారు. పలుచోట్ల అన్నదానాలు నిర్వహిస్తున్నారు.

అబిడ్స్ / అఫ్జల్‌గంజ్ / గన్‌ఫౌండ్రీ: గణేష్ నవరాత్రి ఉత్సవాలు జోరుగా కొనసాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో నెలకొల్పిన గణేష్ మండపంలో స్థానిక పలు పార్టీల నాయకులు, ప్రముఖులు పూజలు చేశారు. ఆయా మండపాల వద్ద ఎక్కడ చూసినా సందడి నెలకొంది.



గోషామహల్‌లో జాగృతి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



సిద్ధి వినాయక ఆలయంలో..



అదనపు డీసీపీ షేక్ జహంగీర్‌ను సన్మానిస్తున్న పర్వతాల రాజేందర్



ఫీల్‌ఖానా గణేష్ మండపంలో..



కార్వాన్‌లో కొలువుదీరిన వినాయకుడు

విశ్రాంత ఐపీఎస్ అధికారికి బెదిరింపులు

బంజారాహిల్స్: అటవీశాఖకు చెందిన భూములను కబ్జా చేశావంటూ గుర్తుతెలియని వ్యక్తి తనకు ఫోన్ చేసి బెదిరించడమే కాకుండా బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడుతున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ విశ్రాంత ఐపీఎస్ అధికారి జేజీ మురళి ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..యూసుఫ్‌గూడలో ఉంటున్న జేజీ మురళికి గత నెల 28న రాత్రి గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. జిన్నారం మండలం, కొడకంచి గ్రామంలో సర్వేనెంబర్ 285లో 49 ఎకరాల ఫారెస్ట్ ల్యాండ్ కబ్జా చేశావంటూ బెదిరించాడు. అయితే సదరు స్థలాన్ని తాను పట్టాదారుల నుంచి కొనుగోలు చేశానని, 13 ఎకరాల అసైన్డ్ ల్యాండ్ కూడా ఉందని ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ డీమార్కేషన్ కూడా చేసిందని, చుట్టూ ఫెన్సింగ్ కూడా ఏర్పాటు చేసుకున్నట్లు మురళి తెలిపారు. గత నెల 31న మరోసారి అదే వ్యక్తి బెదిరింపులతో మెసేజ్ పెట్టి ఈ వ్యవహారాన్ని విజిలెన్స్ శాఖ, న్యూస్ ఛానెళ్లకు చెబుతానని హెచ్చరించాడు. గత రెండు నెలలుగా తాను ఇక్కడ టోన్ క్వారీ, క్రషర్ లీజు గ్రాంట్ల విషయంపై పోరాడుతున్నానని, జే లావణ్య ప్రసాదరాజు, ఈశ్వర్‌రెడ్డి, రవితేజ తదితరులపై తాను పోరాటం చేస్తున్నానని, తనను బెదిరించి వారికి అడ్డులేకుండా చేసుకోవడానికే ఈ రకమైన బెదిరింపులకు పాల్పడుతున్నట్లుగా ఫిర్యాదులో పేర్కొన్నారు. లావణ్యప్రసాద్ రాజు, ఈశ్వర్‌రెడ్డి, రవితేజ, అర్జున్ తదితరులపై అనుమానం వ్యక్తం చేస్తూ వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా కోరారు. జూబ్లీ హిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.